కథ

# పనిమనిషి దేవోభవ!

రోహిణిచింత
హైదరాబాద్, సెల్:9553121430



అమ్మ నిద్దరోయి మూడు రోజులయింది. పగలూ, రాత్రనక మంచంమీద కూర్చొని ఫోను బటన్లు నొక్కుతూ "దొంగపీనుగు ఫోనైనా ఎత్తదు." అనుకుంటూ చిరాకు పడిపోతోంది. నాన్న డాక్టర్ని పిలుద్దామన్నాడు. కానీ విషయం వేరు. "పిలవాల్సింది డాక్టర్ని కాదునాన్నా!" అని నేను నాన్నకి వివరించాను. "పనిమనిషని!"

"ఎవరో వచ్చి చేసిపోతున్నారు కదా!" అన్నాడు నాన్న ఆశ్చర్యంగా. అమ్మకి కోపం వచ్చింది "ఎవరో సరే! అసలు మన పనిమనిషి ఏమైనట్టూ అన్న ఆలోచన లేదా!" అంది అమ్మ రుసరుసలాడుతూ. నాన్న నన్ను ప్రశ్నార్థకంగా చూశాడు.

"వాళ్ళ మామగారికి ఒంట్లో బాగోలేదని రెండు రోజులు సెలవు తీసుకుంది" చెప్పాను నేను.

"రెండు రోజులు కాదు, ఇప్పుడు మూడు రోజులయ్యింది. అసలు ఉందో, ఇదీ పోయిందో" అంది అమ్మ ఆవేశంతో ఊగిపోతూ.

"అమ్మా!" అన్నాను నేను కొంచెం కోపంగా.

"నువ్వు నోరుముయ్యి. పెద్ద దిగొచ్చింది ఊరిని ఉద్ధరించడానికి. ఇంట్లో పనిమనుషుల్ని వెతకలేక తల్లి ప్రాణంపోతే పరవాలేదుగానీ, ఎక్కడో పనిమనిషిని అంటే వచ్చేస్తోంది" అని అమ్మ తిట్టింది.

నేను గదిలోంచి నెమ్మదిగా బయటకు వచ్చేశాను. ఇంతలో మా గంటల గడియారం మోగింది దాని ఇష్టమొచ్చినన్ని గంటలు కొడుతూ. నాన్న నవ్వాడు.

అంతే! అమ్మ "మీరేమిటీ... అలా నుంచుని నవ్వకపోతే కాస్త ఆ గంటల గడియారం బాగు చేయించుకు రావచ్చు కదా!" అంది. నాన్న బయలుదేరాడు. 'ఓయ్' అని అమ్మ మళ్ళీ పిలిచింది. "కాస్త ఆ రెండో పనిమనిషినైనా తిన్నగా తగలడమని ఆ వాచ్‌మేన్‌కి చెప్పి వెళ్ళండి" అంటూ విసుక్కుంది.

నిజానికి అమ్మ చాలా శాంతమూర్తి. ఒక్క పనిమనిషి రానప్పుడు తప్ప. అప్పుడు మాత్రం కొంచెం భద్రకాళి... మా దగ్గర మాత్రమే. పనిమనిషి తిరిగి వచ్చాక మాత్రం దాన్ని ఏదో చిన్నగా మొక్కుబడిగా తిట్టి "ఫోను చెయ్యొచ్చు కదుటే. అసల మీ మామగారికి ఎలా ఉందోనైనా చెప్పావుకాదు" అంటూ కాఫీ ఇస్తూ బుజ్జగిస్తుంది. నాకు అప్పుడు ఒళ్ళు మండిపోతుంది. కానీ ఎందుకులే మనకీగొడవ అని వదిలేస్తాను. ఇప్పుడూ అంతే! అనవసరంగా మాట్లాడితే మనకే ముప్పు.

నేను హాల్లో టి.వి. చూస్తూ కూర్చున్నాను. అమ్మ విసవిసా నడుచుకుంటూ వచ్చి, చప్పున రిమోట్ లాక్కుని "అలా వేళ్ళాడకపోతే కాస్త చదువుకోవచ్చుగా" అంది.

అమ్మ నాకు చదువుకోమని చెప్పేవరకూ వచ్చిందంటే వ్యవహారం చేయిదాటిపోతోందని దాని అర్థం. అందుకు నేను "అమ్మా!నువ్వు ఆ పనిమనిషి గురించి బెంగపడకు. నేను, అది ఫోన్ ఎత్తే వరకూ ఫోన్ చేసి, రేపు రాకపోతే ఇక ఎన్నటికీ రానక్కర్లేదని చెప్పేస్తాను. సరేనా!" అన్నాను.

అమ్మ తనతోపాటూ నేనుకూడా పనిమనిషి బాధని పంచుకుంటున్నానని ఎంతో సంతోషించి "సరే! అలా చెయ్యి" ఇదిగో ఇప్పుడు చేసే టెంపరరీ పనమ్మాయిని పెట్టేసుకుంటామని చెప్పు. దాని తిక్క కుదురుతుంది" అంది కొంచెం స్థిమితపడుతూ. అమ్మకి కాఫీ ఇచ్చి, నేను ఫోను పట్టుకున్నాను. కాఫీ తాగి అమ్మ కాసేపు పడుకుంటానని వెళ్ళింది. నాన్న బాగవ్వని గంటల గడియారాన్ని తెచ్చి మళ్ళీ గోడకి తగిలించాడు. అది యథావిధిగా టైమ్‌తో సంబంధం లేకుండా దానికి తోచినన్ని గంటలు కొడుతూ పడుంది.

అమ్మ, రాత్రి భోజనానికి లేవలేదు. పాపం పనమ్మాయి గొడవతో తలనొప్పి వచ్చుంటుందని మేముకూడా ఇక లేపలేదు. ఒక రాత్రివేళ అమ్మ మాట్లాడుతున్నట్టనిపించింది. "అయ్యిందామ్మా నీ పెత్తనం. ఫోను ఎత్తే తీరిక లేదా? ఒక్కరోజులో వస్తానన్నావు.... మూడు రోజులయ్యింది. ఏమిటసలు నీ సంగతి... పని చేస్తావా చెయ్యవా?"

అని అరుస్తోంది. నిశ్శబ్దం. పాపం అమ్మ ఏమయిపోతోందో. మళ్ళీ అరుపులు.

"అబ్బా! అప్పుడే తెల్లారిందా!" అనుకుంటూ నేను దిండుతో చెవులు మూసుకున్నాను.

అమ్మ మళ్ళీ అందుకుంది. "ఏం మాట్లాడవు? నీ సమాధానం నాకు అక్కర్లేదు కానీ, పోయి బట్టలు నానపెట్టు. మూడు రోజులనుంచీ మురుగుతున్నాయి....పద!" అమ్మ విసుక్కుంది.

నిశ్శబ్దం. "అమ్మా! ప్లీజ్ పడుకో" అని నేను నా గదిలోంచి అరిచా.

"తెల్లారాక పడకేమిటీ?నువ్వుకూడా లే!" అంది అమ్మ. నేను మారు మాట్లాడక దుప్పటి ముసుగుపెట్టా.

"పద!"అమ్మ పనమ్మాయిని గదమాయించింది. "అలా విగ్రహంలా నుంచుని ఏం చూస్తున్నావు"నిశ్శబ్దం. సులోచనకి ఏమయ్యింది? మాట్లాడదే! అనుకున్నాను.

"పద! బోలెడు పనుంది, తెములు. ఏం బొట్టుపెట్టి చెప్పాలా? పని మానెయ్యడం, ఏం అని అడిగితే దిష్టిబొమ్మలా నుంచోవడం. నడువు... ఈసారి జీతం కూడా కట్ చేస్తా" అని అమ్మ అరిచింది. కాసేపయ్యాక చాలా గిన్నెల శబ్దం వినిపించింది.

"ఇవ్వాళ్ళ పనమ్మాయి పని ఫినిష్. అని నేను నవ్వుకున్నా. మూడు రోజుల గిన్నెలూ వేసేస్తోంది అమ్మ. కాసేపటికి గిన్నెల చప్పుడు సద్దుమణిగింది. నేను హాయిగా నిద్రపోయా. మళ్ళీ లేచేసరికి ఇల్లంతా ఎంతో శుభ్రంగా ఉంది. అమ్మ మొహం నవ్వుతో కళకళలాడిపోతోంది. నన్ను చూడగానే అమ్మ ఉత్సాహంగా "ఫోన్లో బాగా బెదిరించావే బుజ్జీ! తెల్లవారకుండానే వచ్చేసింది" అంటూ నవ్వింది.

"అమ్మా! అసలు ఆ ఫోన్ కలవలేదు" అన్నా నేను ఆశ్చర్యంగా.

అమ్మ అదేమీ పట్టించుకోకుండా "పోనీలే వచ్చేసింది కదా!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది. గంటల గడియారం పదకొండు గంటలు కొట్టింది. నేను ఫోన్ చూశా 7 అయింది టైమ్. ఒక గంటయ్యాక పనిమనిషి చక్కగా తయారయి వచ్చింది. "ఏం సులోచనా... మీ మామ బావున్నాడా?" అని నేను అడిగాను . "మంచిగున్నాడమ్మా" అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"మళ్ళీ వచ్చావే" అడిగింది అమ్మ.

"మళ్ళీ ఏందమ్మా? నే గిప్పుడే వచ్చిన. పనంతా చేసేస్తివే.. నే వస్తానని చెప్పి పోయినా కదా" అని దాని దారిన అది చెప్పుకుపోతూ, నన్ను చూసి అమ్మకి ఊకే టెన్షన్ అని నవ్వింది. నేనూ నవ్వా.

అమ్మ మాత్రం నవ్వలేదు. పనిమనిషిని అలాగే చూస్తూ "అదేంటే పొద్దున నా మంచం కాళ్ళ దగ్గర నుంచుని నన్ను లేపావు కదే" అంటూ సంశయించింది. "తెల్లచీర కట్టావు కదే!"

"బుజ్జమ్మా! అమ్మకి నే కల్లోకూడొస్తున్నా!"అంటూ సులోచన నవ్వింది.

"కలాకాదు, నీ మొహం కాదు. పొద్దున్నే చింతనిప్పుల్లాంటి కళ్ళేసుకొని, చింపిరిజుట్టుతో తగలడితే, నేను శుభ్రంగా తయారవమంటేనే కదా, ఇంత సోకు చేశావు" అంది అమ్మ.

"ఏందమ్మో నే గిప్పుడే వస్తున్నా" సులోచన ఆశ్చర్యపోయింది.

"అది టెంపరరీ పనమ్మాయేమోనమ్మా" అన్నాను నేను.

"అది ఆరింటికి ఎందుకువస్తుంది?దాని పనులన్నీ అయ్యాక పదకొండింటికి కదా వస్తుంది" అంది అమ్మ.

"ఆరింటికి వచ్చిందా?" అన్నా నేను అనుమానంగా.

"అవును. గంటల గడియారం ఆరు కొట్టినప్పుడు వచ్చింది. జుట్టుకూడా దువ్వుకోకుండా వచ్చేసింది. పళ్ళైనా తోముకుందో లేదో?" అంటూ సులోచనని చూసి, "చింతనిప్పుల్లాంటి కళ్ళూ ఇదీ" అని గొణిగింది.

"అమ్మా గంటల గడియారం బాగవలేదు"చెప్పా నేను. మళ్ళీ నిశ్శబ్దం.మొదట సులోచన తేరుకుంది. "దయ్యమేమోనమ్మా" అమ్మ మాట్లాడలేదు.

"వామ్మో! అమ్మ దయ్యంతో పనిచేయించినట్లుందమ్మా" అంటూ సులోచన పగలబడినవ్వింది. నేను ఏమీ మాట్లాడలేదు. అమ్మ కాసేపు నిశ్శబ్దంగా నిలబడి తేరుకొని "నోరుముయ్యి. ముందు ఆ వెకిలి నవ్వు ఆపు. లేదా ఆ దయ్యాన్నే పనిలో పెట్టుకుంటా. ఎంచక్కా ఒక్క మాటకూడా మాట్లాడకుండా పనిమొత్తం చేసింది. పైగా ఎంత శుభ్రంగా చేసిందో చూసావా"

"మరి దాన్నే పెట్టుకో" అంది సులోచన.

"ఆ పెట్టుకుంటా. హాయిగా ఇంట్లోనే పడుంటుంది. ఫోన్లు చేసి ఎదురుచూడక్కరలేదు. డబ్బులు కూడా ఇవ్వక్కరలేదు" అంది అమ్మ సీరియస్‌గా,

"సరే గట్లైతే నే పోతా. నీ దయ్యం రాకపోతే రేపు ఫోన్ చెయ్యి" అంటూ సులోచన వెళ్ళిపోయింది. అమ్మ సాయంత్రం నా పక్కన కూర్చుని "బుజ్జీ! దయ్యం వస్తుందంటావా?"అని అడిగింది.

"అమ్మా!" అని నేను అరిచాను.

"ఊరికే అన్నాలేవే అంటూ "అయినా ఆ దెయ్యం ఒప్పుకోవాలి కదా అంటూ అమ్మ లేచింది. నా గుండె గుభిల్లుమంది ఈ పనిమనుషుల గొడవలో అమ్మకి మంచి చెడు తెలియకుండా పోతోంది. నేను గబుక్కున ఫోన్‌తీసి నెంబర్ డయల్ చేసా. "హలో! సులోచనా! రేపొద్దున్నే రా! ప్లీజ్.

"అట్లానేనమ్మా". ఫోన్ డిస్కనక్టెడ్. ఇప్పుడు నాకు పట్టుకుంది పనిమనుషులభయం.

*

సాహితీకిరణంలో ప్రచురితమయ్యే సాహిత్య పోటీలకు, ఇతర వ్యాపార ప్రకటనలకు మా పత్రికకి ఎటువంటి సంబంధంలేదు. పోటీలకు పంపేటప్పుడు కానీ, మరేదైనా సంస్థకు విరాళాలు ఇచ్చేటప్పుడుగానీ సంబంధించిన వారినే సంప్రదించి, నిర్ధారించుకోగలరు.